# చిత్తప్రబోధ

కర్త

'సాధనరహస్య' 'సర్వ సిద్ధాంత సౌరభా' ది

బహు గ్రంథకర్తలు

శ్రీరామకృష్ణాశ్రమములు (బాపట్ల & భీమునిపట్నము)

సంస్థాపకులు

పరమహంస పరివ్రాజకాచార్య

## శ్రీ అనుభవానందస్వామి

ప్రకాశకులు :

**శ్రీ అనుభవానంద గ్రంథమాల**

బాపట్ల-522101 (గుంటూరుజిల్లా)

భీమునిపట్నం-531163 (విశాఖజిల్లా)

సర్వహక్కులు : ప్రకాశకులవి

వాలుగవకుసుమము

5 వ ముద్రణము ; 1990

వెల : 3-00

ప్రతులకు :

1. స్వామి అనుభవానంద యోగకేంద్రము,
   భీమునిపట్నము – 531 163
2. శ్రీఅనుభవానంద గ్రంథమాల,
   బాపట్ల – 522 101

ముద్రణ :
సమతా ప్రింటర్స్
బాపట్ల – 522 101
గుంటూరుజిల్లా

# ఉపోద్ఘాతము

మనస్సును ప్రధానముగా కలవాడు మానవుడు. ఆ మనస్సును సద్వినియోగమొనర్చుకొనిన మానవుడు, ఆధ్యాత్మికముగ ఉన్నత స్థానమును గడించి, మహాత్ముడై విరాజిల్లును. అట్లుకాక ఆ మనస్సునే దుర్వినియోగము గావించుకొనిన తాను చెడి, సంఘమును చెరచి సంఘ వినాశమునకు కారణమగుచున్నాడు. సత్కర్మ, సద్వచన, సద్విచారణ, సద్గ్రంథశ్రవణ, సత్సాంగత్యములలో సత్పురుషుడు కావలయునను భావన, సంఘమధ్యమున జీవించు ప్రతివ్యక్తికి అత్యవసరము. 'నావలన సంఘమునకు హాని కలుగరాదు' అను భావనతో మెలగగలిగిన వ్యక్తి ఎంత అదృష్టవంతుడు! అప్పుడు లోకమున సుస్థిర శాంతియే ప్రవహించును.

మానవుడు సంఘజీవి. తన వ్యక్తిత్వమును కాపాడుకొనుచు, సంఘమున జీవింపవలయునుగదా! ఇది చాల కష్టము. స్వాధీన మనస్కునికే యిది సాధ్యము. మనస్సునుగురించి సంపూర్ణముగ గ్రహించి, ఆ మనస్సును లౌకిక విషయములనుండి మరల్చి, ఇంద్రియముల వశపరచుకొని, విరాగసంపన్నుడు కావలయును. ఆ వైరాగ్యము నిశ్చలత్వము నొందినప్పుడే నిత్య శాంతి.

మనోనిగ్రహము లేనిచో శాంతి అలభ్యమని శ్రీ అనుభవానంద స్వాములవారు యీ 'చిత్తప్రబోధ' లో వ్రాసియున్నారు. ఈ గ్రంథమున, మనోలక్షణములు, లౌకికవిషయ అనిత్యత్వము, మనోప్రబోధము, మనోనిగ్రహవిధానము, అనేక సాధన విషయములు సుస్పష్టముగ వివరింపబడినవి. ఇది సాధకులకు అత్యంతావశ్యకము.

మాతాజీ త్యాగీశానంద

# చిత్త ప్రబోధ

ఉ॥ శ్రీ గుణశోభితంబు, గురుసేవితసాధనసంయుతంబు, దు
ర్యోగనిబద్ధమానవసముద్ధరణైకవిశేషమున్, మహా
1 రాగపరీతసంసృతివిరాగవిధానము, జ్ఞానబోధయున్,
త్యాగవిభూతికాకరము నాబడు దీని బఠింపు చిత్తమా!

ఓ చిత్తమా! శ్రీ గుణములతో శోభించి, గురువులచే సేవింపబడిన సాధనలతో కూడుకున్నదియు, దుర్యోగముతోకూడిన మానవసముద్ధరణ విశేషమును, మహారాగముతో నిండిన బంధ వైరాగ్య విధానమును, జ్ఞానబోధయును, త్యాగనిలయమును అయిన యీ చిత్తప్రబోధమును చదువుము.

మ॥ నిను గుర్తింపగలేనటున్న తలపుల్ నీకుండెనేమో, భ్రమం
చనెదన్, పాలను త్రావు పిల్లి యిటులే యాలోచనల్ సేయదే
2 కనులన్ మూయుచు, 'నీవు కోతి' వని పల్కంగాదె నీయాననం
బును వీక్షించుచు, గాన వ్యర్థ తలపుల్ బోనాడుమా చిత్తమా!

ఓ చిత్తమా! కళ్లు మూసుకుని పిల్లి పాలను త్రాగినట్లుగా, కోతిని చూచి నీవు కోతివని పలికినట్లుగా నిన్ను గుర్తింపలేనను భావన నీకున్నదేమో. అది వట్టి భ్రమ. కాన యిక వ్యర్థ భావనలను త్యజించు.

చ॥ చెడుగలుగంగ గారకులజేయుదువన్యుల నీవు మంచి గ
ల్గెడునపుడన్న నీయడియె కీర్తియ నా బ్రకటింతువిట్టి దీ
3 పుడమి జనించు బూర్వమున బుట్టెను నీకు, బరాయివారలన్
దడయక దూరుటే మతము, తప్పుడుమార్గముకాదె......

ఓ చిత్తమా! నీచెడుకు యితరులను కారణంగా చేస్తావు. మంచి కలిగితే ఆ కీర్తిని నీదిగా చాటుకుంటావు. ఈ విపరీత లక్షణం నీకు యీ లోకంతోనే పుట్టి ఉంటుందేమో! ఇతరులను వెంటనే దూషించటమే నీమతం. ఇది తప్పుసుమా!

శా॥ పై జూపుల్ గనఁగల్గుచో జగతి నిన్ బట్టంగ శక్యంబె? నీ
రాజత్వంబున నెత్తికెక్కి గనులున్ లక్షింతువే పెద్దలన్?
4 ఈ జాడ్యాంధత నాశమయ్యెదవిదే దృష్టి ప్రభావంబునన్
బూజాపాత్రత నొందిరన్యులిది నీ పుణ్యంబహో......

ఓ చిత్తమా! అట్లుకాక నీవు ఊర్ధ్వదృష్టి పొందితే యిక నిన్ను పట్టుకొనగలమా? నీ రజోగుణంచేత కళ్లు నెత్తికెక్కుతాయి. ఇక పెద్దలను లక్ష్యపెట్టుతావా? ఈ రోగంచేత అంధకారం ప్రాప్తించి నశించిపోతావు. కాని యీ దృష్టి ప్రభావంచేతనే అనేకమంది పూజా యోగ్యతను సంపాదించారు. ఆహా! ఇది నీ పుణ్యంసుమా!

శా॥ ఈరీతిన్ గన నూర్ధ్వదృష్టియు నధోదృష్టుల్ ప్రభాయుక్తులై
జేరన్ జేయు యశోవిశేషముమ, నీ ఛిద్రత్వమేమో! యివే
5 వైరంబున్ గొని నిన్ను దుర్గతులలో వైచున్‌గదా! దీనికా
ధారంబెయ్యది నీదు కర్మయెసుమా! తథ్యంబుగా...

ఓ చిత్తమా! పై విధంగా ఊర్ధ్వదృష్టి అయినా, అధోదృష్టి అయినా ఉన్నత స్థితులను అందిస్తాయి. కాని నీ రంధ్రాన్వేషణ కారణంగా యివే నిన్ను దుర్గతిని పొందింపచేస్తున్నవి. దీనికి కారణం ఏమిటో తెలుసునా? యథార్థంగా ఆలోచిస్తే నీ కర్మయేసుమా.

మ॥ విషయాళిన్ గని సౌఖ్యసంపదలలో బెంపొందగా జేయు నా
మిషతో మున్గిన నాశమౌదువుసుమా! మేధావతిన్ జూచుచో

6 విషసర్పంబుల గౌగిలింతలివి యీ వెర్రెట్లు నిన్ బట్టె?
విషయంబీవు తలంపవే! ఎరుగవే! వింతయ్యెనే......

ఓ చిత్తమా! లౌకిక విషయాలను చూచి, సుఖసంపదల వృద్ధి చేయ సంకల్పించి అందు మునిగినచో నశించిపోదువు. బుద్ధి ఉపయోగించి చూచినచో యీ రహస్యాన్ని గ్రహించుకుంటావు. ఈ విషయాలతో పొందుకోరటం విషసర్పాలను కౌగిలించుటవంటిది. గ్రహించుకో! నీకు యీ వెర్రి ఎందుకు వచ్చింది? నీకు తెలియదా! ఎప్పుడైనా యీ విషయం ఆలోచించావా!

చ॥ ఇతరుల దోషమెంచి తమ హేయగుణంబుల బూతవేయు ప
ద్ధతి ధరయంతటన్ సహజధర్మము, దీనినె యాశ్రయింప స
7 గతియు నిజంబు దుర్గతియ కాన యథార్థమెరింగి యోచనా
రతి స్వపరత్వమున్ దుడుప గంజిల గల్గదె ముక్తి......

ఓ చిత్తమా! లోకంలో ధర్మమేమిటో తెలుసునా? ఇతరుల దోషాలను ఎత్తి చూపించటం, తమ దోష సమూహాన్ని మంచిగా చూపింప యత్నించటం. ఈ పద్ధతినే నీవు ఆశ్రయించాలని ఉద్దేశమైనచో నీకు దుర్గతిమాత్రమే లభిస్తుంది. కాబట్టి యథార్థం తెలుసుకో! ఆలోచించుకో! స్వపరభేదాన్ని దూరం చేస్తే ముక్తి కలుగుతుందిసుమా!

మ॥ పసిబాలుం గని స్వీయ దోషముల నాపాదింతురా పాపబు
ద్ధి సగర్వుండని మహాత్ములట్టి జగతిన్ దోషమ్ము లెల్లప్పుడున్
8 పసితూపల్ భరియింతురి వాని క్షమతో బ్రాప్తంబులం బెంచిన
న్ సగర్వంబుగ జూచుచుందురితరుల్ నిశ్చింతతో......

ఓ చిత్తమా! ఈ లోకంతీరు చూచావా! పసిబిడ్డలను చూచి తమ దోషముల నా పసికూనలకు అన్వయించినట్లుగా, దోషరహితులైన మహాత్ములనుకూడా ఆదే దృష్టితో దోషులుగనే చూస్తూ ఉంటారు పాపం! ఆ పసిబిడ్డలు 'ఇది మా పూర్వ జన్మ ప్రాప్తం' అని ఓర్పుతో భరిస్తారు. ఈ విధంగా పసివారిని, మహాత్ములను బాధిస్తూ ఉంటే నిశ్చింతగా యితరులు చూస్తూ ఉంటారు.

శా॥ ఏ సూత్రంబున వారి కర్మఫలితంబీ పాపలన్ ముంచు? నే
దోసంబుల్ గనరాని వీరు భువిలో దుర్మార్గులౌటెట్లు? ఆ
9 ధ్యాసన్ రజ్జగ గాదె సర్పముగ, నా త్రాటిన్ భ్రమన్ గొట్టమే
ఆ సూత్రంబు నచింత్యమౌ నిదియు భావాతీతమౌ... ...

ఓ చిత్తమా! ఆ పసిపాపల కర్మఫలితం వారిని ఏ విధంగా ముంచుతుంది? ఏ దోషాలను చేయని వీరు యీ లోకంలో దుర్మార్గులు ఏవిధంగా అవుతున్నారు? దీనికి సూత్రం ఏమిటి? భ్రాంతి సమయంలో త్రాడును చూచి పాముగా భావించి, ఆ త్రాటిని భ్రాంతితో కొట్టిబాధిస్తున్నాముగదా! అది అచింత్యం, భావదూరం! వేరే ఏమి చెప్పగలం!

చ॥ తమ ప్రతిబింబమున్ గనుచు దర్పణదోషమటంచు దానిపై
దమ కుగుణాల ద్రోసి, కట! దర్పణనాశముజేయ న్యాయమే
10 తమమున నజ్ఞమానవుల ధర్మము లోకమునందు స్వీయ దో
షముల బరీక్ష సేసి గనజాలరు మూఢులుగాదె!......

ఓ చిత్తమా! చూచావా? అద్దంలో తమ ప్రతిబింబాన్ని చూచి తమ దుర్గుణాల నా దర్పణమునకుఆపాదించి, ఆ అద్దమును నాశనం చేసినట్లుగా తమోగుణావిష్టులైన అజ్ఞమానవులుగూడ తమ దోషముల గ్రహింపలేరు. ఇదే లోక ధర్మం. వీరు ఎంతమూఢులో గ్రహించుకో.

ఉ॥ దీని పరింత్రు పండితులు, దీనికి బామరులెల్ల దాసులే
దీనగదా గృహస్థులు, యతీశ్వరులైన జరింత్రు, గానలో
11 కాన శరణ్యమేది గుణగణ్యులకింక? పరాత్పరుండనన్
మౌనము!కాన యుక్తవీమగు మౌనము రికిగూడ...

ఓ చిత్తమా! లోక పద్ధతినే అనుసరిస్తారు పండితులు. ఈ లోకవిధానానికి పామరులందరు దాసానుదాసులే. దీన్నే గృహస్థులు ఆచరిస్తారు. ఇక గుణవరేణ్యులైనవారికి యీ లోకంలో ఏది శరణ్యం? పరాత్పరుడందామా మౌనం. కాన యీ ఉత్తములకుకూడా మౌనమే శరణ్యమేమో!

ఉ॥ నమ్మినవారి కుత్తుకల నక్కోడువారిది లోకమంచు చి
త్తమ్మున నేర్వలేక ప్రతి ధర్మవిహీనుని విశ్వసించుచో
12 గ్రమ్మర గొంతుకోతలనె గాంతువుదాని ఫలంబుగా, యథా
ర్థమ్ముగ లోకధర్మమిది ప్రస్తుతకాలమునందు...

ఓ చిత్తమా! ప్రస్తుతకాలంలో లోకధర్మం ఏమిటో తెలుసునా? 'నమ్మినవారి గొంతుకల కోసేదే లోకం' అని తెలుసుకో, ప్రతి దర్మహీనుని నమ్మితే నీవుకూడ అదే దుష్ఫలితాన్ని అనుభవిస్తావు. ఇది యథార్థం సుమా!

శా॥ ధర్మాధర్మవిచక్షణంబనెడు సద్ధర్మంబు శూన్యంబు దు
ష్కర్మన్ నుగ్నత మెందు, స్వార్థమువిశేషాధిష్ఠతన్ గాంచె, లో
13 మర్మంబుల్ బహుళంబు. సత్యనిరతుల్ మాయంబుగానున్న దు
ష్కర్మాగారము లోకమందెట్టుల వాసంబుందువో!.....

ఓ చిత్తమా! ఈ లోకవిషయం చెప్పుతాను. విను. ధర్మాధర్మ విచక్షణలేనిది యీ లోకం. సద్ధర్మం శూన్యం. దుష్ట కర్మ

లలో ఆసక్తి అధికం. స్వార్థం విశేషంగా ఉన్నది. లోపల కల్మషాలు. సత్యనిష్ఠులుగా కనిపించువారుకూడా మాయకు స్వాధీనులుగా ఉన్నారు. దుష్కర్మలకు ఆలవాలం. ఇటువంటి యీ లోకంలో నీవు ఎట్లా నివసిస్తావో !

శా॥ ఏ దిక్కున్ బరికించినన్ గటగటా హింసాస్వరూపంబులే
నీ దృశ్యంబులు ! ప్రాణహానిగద ప్రాణిన్ నిల్పు నారీతి గ
14 ట్టా! దుఃఖాకృతి, మోసగింపులన దట్టంబైన లోకంబులో
నే దారిన్ మనబూనితో? జగతి నిన్ హింసింపదే ...

ఓ చిత్తమా! అయ్యో! ఎటు చూచినా యీ దృశ్యాలన్నీ హింసతో కూడుకొన్నవేగదా! ప్రాణరక్షణలోకూడ ప్రాణహానియే గదా! అయ్యో! దుఃఖరూపమే! వంచనలకు నిలయమైన యీ లోకంలో, నీవు ఏ విధంగా ఉంటావో! లోకం నిన్నుమాత్రం బాధించదా ఏమిటి?

ఉ॥ ఇప్పుడు స్నేహితుల్, మతివిహీనత బిమ్మట నిన్ను ద్రుంపగా
జొప్పడ యత్నముల్ సలుపు క్షుద్రులుగూడ నిజంబు వారలే,
15 ఇప్పగిదిన్ దురాత్ములకు నిల్లిది లోకము, దీన నుంట నే
తప్పుడువారి బారిబడి తల్లడమందుదువొక్కొ ! ...

ఓ చిత్తమా! ఇప్పుడు స్నేహితులుగా ఉన్నవారే, నీకు మతి చలించినచో నిన్ను నాశనం చేయటానికి యత్నించే క్షుద్రులు అనే యథార్థాన్ని గ్రహించుకో! ఈ విధంగా దుర్మార్గులకు పుట్టినిల్లు యీ లోకం. ఇట్టి యీ లోకంలో ఉంటూ, వారి చేజిక్కి ఏ విధంగా బాధలను అనుభవిస్తావో ఆలోచించుకో.!

ఉ॥ ఇంతటిదేగదా జగతి, హీనపుబుద్ధులకాశ్రయంబు, నా
వంతయు న్యాయమే గనక స్వార్ధపరత్వము నాశ్రయించుటన్
16 ఎంతటి నీచ కార్యమును నేనియు జేయగ జంకకుండు, నీ
స్వాంతమునందు శాంతి నెటులార్జన సేతు జగాన ....

ఓ చిత్తమా! ఈ లోకం తీరు చూచావా? నీచ బుద్ధులకు ఆశ్రయం. న్యాయం శూన్యం. స్వార్ధపరత్వంలో పూర్తిగా మునిగి ఎటువంటి నీచ కార్యాన్నైనా చేయటానికి వెనుకాడదు. ఇదే ప్రపంచం. ఇటువంటి లోకంలో ఉన్న నీవు స్వాంతంలో శాంతిని ఏవిధంగా సంపాదిస్తావో!

ఉ॥ కాని యథార్థ దోషముల గాంచి విమర్శన సేయ మంచిదే,
కాని యబద్ధముల్ బలురకంబులుగా సృజియించి ద్వేషమై
17 వానిని జాటజూచినను బాధ రవంతయు లేదు, సూక్ష్మమై
లోన గుబుద్ధి యున్న, నది లోన నశించునుగాదె ..

ఓ చిత్తమా! కాని లోకంలో సద్విమర్శన లేదు. యథార్ధ దోషముల చూచి విమర్శించిన మంచిదేగదా! కాని లేనివి సృష్టించి, ద్వేషంతో అనేకవిధాలుగా ప్రచారం చేసినా బాధలేదు. ఒకవేళ సూక్ష్మరూపంలో సూక్ష్మంగా దుర్బుద్ధి ఉంటే అదిగూడ నశిస్తుంది గదా!

మ॥ ఎటు బోజూచిన భేదభావజములో హేయంపు పోరాటముల్
బటుదీవ్రంబుగ బ్రజ్వలించి నటనాప్రావీణ్యమున్ జూపి, యెం
18 తటి సిద్ధాత్మునినైన నూపుటలు ప్రత్యక్షంబు, లోకంబు బు
ట్టుటకున్ బూర్వమె భేదముల్ గలుగుచాడ్పున్ దోచునో .....

ఓ చిత్తమా! బాహ్యప్రపంచంలో ఎక్కడికైనా వెళ్ళి ఉంద వలెనని భావించకు. ఎక్కడికి వెళ్ళినా భేదభావములే! దానివలన హేయమైన తగవులే. ఆ తగవులు తీవ్రంగా పరిణమించి, చక్కగా నటించి, ఎటువంటి మహాత్ములైనా చలింపజేయటం సుస్పష్టంగా కనిపిస్తున్నది. బహుశః యీ భేదాలు యీ లోకల పుట్టటానికి ముందే ఉన్నవేమో అనే భావన కలుగుతుంది.

ఉ॥ ఆకలిగొన్నవానికిసుమంత భుజింపగ నిచ్చినన్ గుణం
బే కనబోక తృప్తిపడి ప్రేమను జూపును గాని, బొత్తిగా
19 నాకలి లేనివానికి ప్రియంబున భక్ష్యములిచ్చినన్ దినం
బోక, దొసంగులెంచుటకు బూను ధరాతలమందు .....

ఓ చిత్తమా! ఈ లోకం పోకడను గ్రహించుకో. బాగా ఆకలిగా నున్నవానికి కొద్దిగా భోజనం పెట్టితే, ప్రేమతో తృప్తిగా భుజించి, దోషాలను ఎంచడు. ఆకలి లేనివానికి ప్రేమతో మంచి భోజనం ఏర్పాటు చేసినా, తినకపోగా దానిలో గల లోపాలను చూపించ ప్రయత్నిస్తాడు. ఇది లోకంతీరుసుమా! (ఆకలి గొన్న వానికే భోజనం యిష్టంగా ఉంటుంది. అదే విధంగా ఆధ్యాత్మిక తాపం కలిగినవారికే ఆధ్యాత్మిక జీవితం ప్రియంగా ఉంటుంది.)

ఉ॥ బంధము బంధమంచు బలుభంగుల వేదన నొందనేల? సం
బంధములేని నీకు గన బంధము దుర్లభమెచ్చటైన, నీ
20 బాంధవ భావజాలములె బంధన హేతువులౌను, కావునన్
బాంధవ భావనాశనమె బంధవిముక్తి నొసంగు ,,...

ఓ చిత్తమా! 'బంధం—బంధం' అని ఎందుకు వేదన పొందు తావు? సంబంధంలేని నీకు బంధం ఎక్కడున్నది? బంధువులతో పెట్టుకొనిన భావ సమూహమే బంధనానికి కారణము. కాబట్టి బంధు నాశనం కాక భావ వినాశమే బంధవిముక్తిని కలిగిస్తుందిసుమా!

శా॥ బంధంబన్నది నీదు దుర్బలత నా భావంబులన్ ద్రోసి, నీ
యంధత్వంబున వారి వీరి ననుటల్ వ్యర్థంబు, యోచించి, యా
21 బంధధ్వంసక సూత్రమాత్మబలమున్ బ్రాప్తంబుగా జేయ, నా
బంధాతీత యథార్థ సంస్థితులు సంప్రాప్తించునో ,,,..

ఓ చిత్తమా! అసలు బంధం అనగా ఏమి? బంధం అన్నీ నీదుర్బలత్వం. ఆ బలహీనతను అంగీకరింపక గ్రుడ్డిగా వారిని, వీరిని అనుకోటం వ్యర్థం. ఆలోచిస్తే ఆ బంధ నాశనసూత్రం ఆత్మబలంలో ఉన్నది. ఆ ఆత్మబలాన్ని పొందితే ఆ బంధాతీతమైన యథార్థ ఆత్మ సంస్థితులు సంప్రాప్తిస్తాయిసుమా!

శా॥ భావంబందు ఘటిల్లు బంధమను భావంబున్ విలోకించి, యే
భావంబుల్ గనకుండ నుండుటయు సంభావ్యంబు గాకుంటచే
22 భావాతీత గుణస్థితిన్ గనుచు భావంబుండి లేనట్లు, లో
భావింపంగలవేని బంధరహితంబౌ సత్యమే ..,...

ఓ చిత్తమా! 'భావంలోనే బంధమున్నది' అను భావాన్ని గ్రహించుకో. ఏ భావం లేకుండా ఉండటం సాధ్యం కాదు. అందుచేత భావాతీతమైన స్థితిని పొంది, భావం ఉండి, లేనట్లు భావించితే యథార్థంగా బంధరాహిత్యం కలుగుతుందిసుమా!

శా॥ విన్నాడన్ భవదీయ తత్త్వమును సద్విద్యాధికుల్ సెప్ప,బై
గన్నారన్ గనినాడ నీ నడత, లోకంబందు నిన్‌గూర్చి నే
23 నిన్నో వింటినిగాని నా విషయమందీవిట్లు చాంచల్యవై
యున్నావా? ఇక ధ్వంసమౌదువుసుమా! యున్మత్తవా...

ఓ చిత్తమా! విద్యాధికులైనవారు నీ తత్త్వమును చెప్పగా విన్నాను. మరియు నీ నడతను కన్నులారా చూచాను. నిన్ను గూర్చి లోకంలో చాలా విన్నాను. కాని అదే విధంగా నా విషయంలో ఉన్నావంటే నాశనం అవుతావు. పిచ్చిదానివా?

శా॥ లోనంగల్గు విముక్తిగాంక్షయుతకల్లోలాల నట్లుంచి, లో
కానం గల్గు విరుద్ధ తత్త్వములతో గాట్లాటలన్ మున్గి, సు
24 స్థానంబున్ విడనాడగా తగునె ప్రశాంతస్థితుల్ వోవగా!
గానన్ లెమ్ము, నిజంబెరుంగు మెద నింకైనన్ గటా!...

ఓ చిత్తమా! లోపల ముక్తికొరకు కలిగిన కాంక్షలతో కూడిన కల్లోలాలు అలా ఉండగా, లోకమున గల విరుద్ధ తత్త్వములతో పోట్లాటలో మునిగి, ప్రశాంతత పోగొట్టుకొని మంచి స్థానమును పోగొట్టుకొనతగునా? కాన లే, ఇకనైనా నిజాన్ని గ్రహించు.

చ॥ నిను దరియింపజేయు పని నే దలదాల్చుచు వచ్చినాడ నా
దు నెలవు వీడి, నీ బహుళ దుస్థితి గాంచి దరింపజేయగా,
25 వినుము పరాకులేల? చెడువృత్తి జరింపక నాదు మార్గమున్
గొనుము పవిత్రమౌటకిది గొప్ప విశేషము వెర్రి ........

ఓ వెర్రిచిత్తమా! నా స్థితి నుండి నీ దుస్థితిని గాంచి, తరింప జేయు పనిని ముఖ్యంగా పెట్టుకొని వచ్చానుసుమా! విను, పరాకు ఎందుకు? చెడు వృత్తితో చరింపక నా మార్గాన్ని స్వీకరించు. పవిత్రం కావటానికి యిది ఒక గొప్ప అవకాశం.

మ॥ వినవా! కొంచుము, సర్వదుఃఖమయసంవృత్యుక్తమైబంధమై
తను ధర్మంబులకాలవాలమగు స్వార్థత్వాబ్ధిలో మగ్నమై
26 చను లోకంబున మున్గి భ్రాంతియను పాశానన్ దగుల్గొంచు నా
శనమై పోదువు, కాన మాట వినవే సత్యార్థివై .....

ఓ చిత్తమా! చూడు! నా మాట వినకున్నచో, సర్వదుఃఖము లతో కూడినదై, బంధమై, శరీర ధర్మములకు నిలయమైన స్వార్థ సంద్రమున మునుగుచు పయనించు లోకమున మునిగి, భ్రాంతి అను పాశాలలో దగులుకొని నాశనం అవుతావు. కాన సత్యస్వరూప గ్రహణార్థివై నా మాట విను.

మ॥ నిను నేవెర్రిగ నాశ్రయించినచొ దుర్నీతుల్ మెడన్‌జుట్టి నన్
జెనటిన్ జేయుచు నీవు చచ్చెదవు నన్ జేరంగ నీవున్నచో
27 నిను నాత్మైక్యము నొందజేసి పిదపన్ నే నాత్మలో లీనమౌ
దును రమ్మా, వినుమా, యిదే చెడకుమా, దుర్బుద్ధివై ...

ఓ చిత్తమా! నేను వెర్రివాడినై నిన్ను ఆశ్రయించినచో, అనేక చెడు గుణముల నా మెడకు చుట్టి, నన్ను మూర్ఖునిగా జేసి, నీవుకూడా చెడిపోయెదవు. కాని నీవు నన్ను జేరినచో నిన్ను ముందుగా ఆత్మలో లీనము గావించి, తరువాత నేను ఆత్మైక్యమును పొందగలను. దుర్బుద్ధితో చెడిపోవద్దుసుమా! రా! నా మాట విను.

ఉ॥ తప్పుల నెంచువారికిది స్థానము లోకము, నీవటన్న నీ
తప్పుల సున్న జేయగల దారి గవేషణ సేయుచుంటి, వీ
23 తప్పులమాత్రమే గనెడు దాతలమధ్య చరించితేని నీ
తప్పులు వోయి నీ విమలతత్త్వము భాస్వరమౌను .....

ఓ చిత్తమా! ఈ లోకంలో తప్పులను ఎత్తిచూపించేవారిదే స్థానం. నీవో! తప్పులను పోగొట్టుకోవాలనే ప్రయత్నం చేస్తున్నావు. నీవు నీ తప్పులనుమాత్రమే చూచేవారిమధ్య సంచరించితే నీ తప్పులు పోయి, యథార్థతత్త్వం ప్రకాశిస్తుందిసుమా!

శా॥ దీనన్ సౌఖ్యము గల్గుచున్నదని నీ తీర్మానమై యున్నచో,
గానంగాదె క్షణంబులో సమసి దుఃఖాక్రాంతులన్ జేయుటల్,
29 గానన్ శాశ్వతసౌఖ్యమొందగల మార్గంబొండు బోధింతు, నా
యానల్ సల్పుము, సత్యమారయుము, సమ్యగ్దృష్టితో ...

ఓ చిత్తమా! ఈ లోకంలో సౌఖ్యం లభిస్తుంది అనే నీవు తీర్మానించినచో, ఆ సుఖం క్షణంలో దుఃఖంగా మార్పు చెంది, దుఃఖాక్రాంతులను చేస్తున్నది గదా. అందుచేత శాశ్వతమైన సుఖాన్ని పొందే మార్గాన్ని నీకు బోధిస్తాను. నా ఆజ్ఞలను పాటించు. సత్య దృష్టితో సత్యాన్ని గ్రహించుకో.

మ॥ ధరలో సర్వచరాచరంబులకు నాద్యైవంబొసంగెన్ గదా
స్థిరమైయొప్పెడు యూర్ధ్వదృష్టి, నిక నాదేవుండు నీయోగ్యతన్
30 ధెల్లిఘం జూచియె యిచ్చియుండెడు నధోదృష్టిన్సునాయాసమై
దురితాంబోధి మునింగి చచ్చుటకు నీ దుష్కర్మచే .....

ఓ చిత్తమా! ఆ సృష్టికర్తయైన భగవంతుడు యీ జగత్తులో సర్వచరాచర జీవకోటికి స్థిరంగా ఉండే ఊర్ధ్వ దృష్టిని ప్రసాదించాడుగదా! కాని, నీ యోగ్యతను బరీక్షించటానికో అను రీతిగా, నీ దుష్కర్మచేత సులభంగా పాపసముద్రంలో బడి మునిగి నశించటానికి నీకు అధోదృష్టిని యిచ్చాడనుకుంటాను.

శా॥ క్రిందన్ బ్రాకెడువేళ్ళు స్వార్థరహితోత్కృష్ట ప్రభావంబులున్,
గ్రిందన్ శీర్షమునుంచుమౌనిగలయుత్కృష్టాత్మ భావంబులున్,
31 గ్రిందన్ బారు నదీ వినిర్మల మహోత్కృష్ట ప్రకాశంబులున్,
గ్రిందన్ జూచియు నీకు గల్గవుగదా! కీర్తింపగా ......

ఓ చిత్తమా! క్రింద నుండియు ఊర్ధ్వంగా ప్రయాణం చేసి, తమ ఆదర్శాన్ని వ్యక్తం చేసేవి ఎవో లోకంలో ఉన్నాయి చూడు. చెట్ల వేళ్ళు క్రింద ప్రాకుతూ, నిస్వార్థంగా వృక్షాన్ని పెంచుతాయి. మునివర్యులు తల్లక్రిందులుగా తపస్సు చేసినా వారి భావాలు ఉన్నతంగా ప్రసరిస్తాయి. అదేవిధంగా నదీమతల్లి నిర్మలంగా క్రింద ప్రవహిస్తూ, ఆవిరి రూపంలో మరల పైకెగసి, మానవాళికి వర్షాన్ని యిస్తున్నది. వీటిని క్రిందగా చూస్తున్నప్పటికి వాటి ఉత్కృష్టతను నీవు కీర్తించలేకపోతున్నావుగదా!

శా॥ పైకెన్ దుఃఖము దోచు, లో గనినచో బ్రాపించునానందమే
ఏకాంతస్థితి సాధనాజనిత సద్వృత్తాంతముల్ వీని నీ
32 పైకాగ్రస్థితి జొందగల్గుదువు, నీకింకేల భీరుత్వముల్
పైకెన్ దోచెడి రూపు గాంచుటయదే పైపూతయే ......

ఓ చిత్తమా! భ్రష్టత్వానికి కారణం గ్రహించావా? ఈ లోకం లో బాహ్యరూపాన్ని చూడకు, పై మెరుగే యిదంతా! పైకి కష్టగాం ఉండినా అంతరంగంలో ఆనందం ప్రాప్తిస్తుంది. సాధనా జనితమైన సద్విషయములను శ్రవణం చేస్తే నీవు ఏకాగ్ర స్థితిని పొందగలవు. ఇక నీకు భీరుత్వం ఎందుకు?

శా॥ పూతన్ జూచి యథార్థమంచుగని నొప్పున్ భ్రాంతిచే నీకు, యీ
రీతిన్ దుఃఖము సౌఖ్యమౌ, సుఖము వర్తించున్ మహాదుఃఖమై,
33 యీ తత్త్వంబు నెఱుంగ చాల సులభంబేగాని సాధింపగా
జేతన్ గాదతికష్టమై తనరుటన్ జింతింపవే ......

ఓ చిత్తమా! నీ భ్రాంతిచేత పై పూతలు నీకు యథార్థంగా కనిపిస్తాయి. అనగా దుఃఖం సుఖంగా, సుఖం దుఃఖంగా ప్రవర్తిస్తాయి ఈ తత్త్వాన్ని గ్రహించటం సులభసాధ్యమేగాని సాధించటంమాత్రం చాం కష్టం అని గ్రహించుకో.

శా॥ మాటల బొద్దుబుచ్చు మతిమంతులకున్, జిరకాల సాధనా
పాటవమొందియున్న బుధవర్యులకున్ సులభంబు, భేదమా?
34 మాటలు కోటదాటునను మాట నెరుంగవె? వీరిదింతియే!
ఆటలు వారికాత్మవిషయాలన సాధనచేత ........

ఓ చిత్తమా! ఈ లోకంలో యీ తత్త్వ విషయాలు ఇరువురికి సులభంగా కనిపిస్తాయి. ఒకటి ఆచరణ శూన్యులై మాటలతో కాలం గడిపేవారికి సులభం. రెండు చిరకాలంనుండి సాధనాపటిమనుపొందిన బుధవర్యులకు సులభం. వీరిరువురికి ఎంత వ్యత్యాసం! మాటలు కోటలు దాటుతాయి అనే సూక్తి తెలుసునా? సాధనచేత ఆత్మ విషయాలతో ఆడుకుంటారు ఆ మహాత్ములు.

శా॥ నీకాధారము బాహ్యలోకమనుచున్ నీవెంచబోకమ్మ, ము
ల్లోకాలన్ భరియించు తత్త్వమదె నీలో నున్నదోయమ్మ, ఈ
35 శోకస్థానము నొందజేయు గుణముల్ లోనున్నవోయమ్మ నిన్
దాకన్ జాలునె లోకపాశములు సత్యంబమ్మరో! ......

ఓ చిత్తమా! నీకు బాహ్యలోకం ఆధారమని తలంచకు మూడు లోకాలను భరించు తత్త్వం నీ లోపల నున్నదమ్మా! ఈ లోకపాశాలు నిన్ను చేరగలవా? ఇది సత్యం.

శా॥ అందగరాని బాహ్యపు సహాయము గోరగనేలనమ్మ, నీ
కందుచునున్న లోని సుఖదాయక శక్తుల బ్రిక్కనుంచి, నీ .
36 వొందగబూను యాత్మ వెలినున్నదె! లో దిగి చూచుకొమ్ము! ఈ
చందము తప్పు దోవ దిగి సత్యము గోల్పడవద్దు ......

ఓ చిత్తమా! నీ లోపలనుండి, నీకందుచుండిన సుఖప్రదమైన శక్తుల గాంచక, నీకు అందనట్టి యీ బాహ్య సహాయము నెందుకమ్మా కోరతావు? నీవు పొందనున్న ఆత్మ బాహ్యంలో ఉన్నదా? ఒక్కసారి లోనికిదిగి చూచుకో! ఈ విధంగా తప్పుగా ప్రయాణించి, సత్యాన్ని దూరం చేసుకోవద్దు.

శా॥ ఆరోగ్యంబె శరీరదార్ఢ్యమగు, ధీ యౌన్నత్యమే బుద్ధి కా
ధారంబైన బలంబు, నాత్మబలమున్ స్థాపించు సత్సాధనం
37 బీరీతిన్ త్రివిధాల శక్తి గనినన్, హేయంపు సంసారమున్
ధీరత్వంబున గెల్వ జీవితము శాంతిన్ బొందునో ......

ఓ చిత్తమా! శరీర దృఢత్వమే ఆరోగ్యం. బుద్ధియొక్క ఔన్నత్యమే బుద్ధికి ఆధారమైన బలం. ఆ బలమే ఆత్మబలాన్ని స్థాపించే

సత్ సాధనం. పైరీతిగా మూడు విధాలగా శక్తిని సంపాదించి ధీరత్వంతో నీచ సంసారమును గెలిచిన జీవితం శాంతిని పొందుతుంది

చ॥ జరిగిన దానినే తలచి శాంతిని గోల్పడరాదు, యిప్పుడే
జరుగుచున్న దాని గని సాక్షివలెన్ సమవృత్తినుండుమా!
౩౮ జరుగగనున్న దాని మనసా స్మరియించి తపింపవద్దు, యీ
స్థిరమతి బొందుచో నదియె క్షేమపదంబు, విముక్తి ......

ఓ చిత్తమా! జరిగినదానిని తలచుకొని శాంతిని పోగొట్టుకో, కూడదు. ఇప్పుడు జరుగుతున్న దానిని సాక్షివలె చూస్తూ ఉండు. జరగబోవు దానిని స్మరించి తపించవద్దు. అనగా భూత భవిష్యద్వర్తమాన కాల విషయాలను స్మరించక, స్థిరత్వాన్ని పొందాలి. అదియే క్షేమస్థితి విముక్త స్థితి.

శా॥ దూరాలోచన జూడుమెద్ది నిను నీ దుశ్చింతలన్ ముంచు? 'ఛీ
ప్రారబ్ధం' బని 'పాడు దైవ' మనుచున్, పాపిష్టిలోకంబు నా
౩౯ నీ రీతిన్ దురపిల్లుటే! విదితమౌ హృద్దుర్బలత్వంబులన్
బారన్ ద్రోలగరాదె! శక్తి యరుదే, భ్రాంతిల్లుటే ......

ఓ చిత్తమా! ఈ దుశ్చింతలలో నిన్ను ముంచునది ఏదో కొద్దిగా దూరాలోచన చేసుకో. 'ఛీ ప్రారబ్ధం,' అని 'పాడు దైవం' అని, 'పాపిష్టి లోకం' అని అనటంలోనే నీ హృదయ దుర్బలత్వం వ్యక్తం అవుతున్నది. ఆ దౌర్బల్యాన్ని పోగొట్టుకోలేవా? నీకు శక్తి లేదా?

చ॥ పదుగురగూడియుండదలపన్ వలదమ్మ, జనించునాడు నా
పదుగురతోడ రావుగద! ప్రాణము వీడునాడుగూడ ఆ
40 పదుగురు రారు నీ వెనుక బాంధవబుద్ధిని నీవు దాల్చినన్
పదుగురు రారు నిన్గలిసి వ్యర్థపు భ్రాంతిని వీడు ......

ఓ చిత్తమా!పదిమ్మందితో కలిసి ఉండాలని నీవు భావింపవద్దు, పుట్టిననాడు ఆ పదుగురితో కలిసి రావటంలేదు. అంతేకాదు. ప్రాణం పోయినతరువాతకూడ ఆ పదిమంది నీ వెనుక రారు. బంధువులు అనే బుద్ధి నీకున్నను ఎవరును నీవెంట రారు. అందుచేత అనవసరపు భ్రాంతిని త్యజించు.

చ॥ అదియునుగాక సర్వజగమంత సృజించి భరించి ద్రుంచు శ
క్తి దిగద లోకరక్షణము! దీని నెరుంగక లోకతారణం
41 బెద గలదంచు నీవు భ్రమియించుటగూడదు, దాన నీదు శాం
తిదమగు జీవితంబునకు దీవ్ర విఘాతము గల్గు ........

ఓ చిత్తమా! అహంకారం పనికిరాదుసుమా! జగత్తునుసృజించి పోషించి, లయింపజేసే ఆదిశక్తిది లోకరక్షణ బాధ్యత. దీనిని గ్రహించక, నీవు లోకాన్ని తరింపజేయగలననే భ్రమను పొందరాదు. దానివలన నీ శాంతియుతమైన జీవితానికి తీవ్రమైన బాధ కలుగుతుంది. నీవు శాంతిని కోల్పోయి అశాంతిపాలవుతావుసుమా!

చ॥ అనుదినమాత్మశిక్షణమునందు మునింగి, యనుక్షణంబు జీ
వనమును శుద్ధిజేయుచు నవశ్యము ధ్యాననిమగ్నమొంది, శో
42 భనమగు బ్రహ్మమందు మను భవ్యచరిత్రు గరంబునుండదే
గుణవిభవోత్తమానుభవకోటి యదెంతటిదైన......

ఓ చిత్తమా! నిత్యము ఆత్మ శిక్షణలో మునిగి, అనుక్షణం జీవనాన్ని పరిశుద్ధం చేసుకుంటూ, సదా ధ్యాననిమగ్నత పొంది, ఆనందప్రదమగు బ్రహ్మజ్ఞానుల, పవిత్ర చరిత్రుల చేతిలో ఆ ఉన్నత గుణసంభరితమైన ఉత్తమ అనుభవకోటి నివసిస్తుందిసుమా.

ఉ॥ చిత్తమ! చంచలత్వము నశింపగ నే రచియించినట్టి యీ
యుత్తమ భావజాలముల నుత్సుకతన్ దినచర్యనందె లో
43 కోత్తరదీక్ష బూనగలవో! పరమానుభవౌఘసంస్థితా
యత్తవిశాల శాంతమధురామృతపానము గల్గు ........

ఓ చిత్తమా! నీ చంచలత్వం పోవటానికి నేను రచించిన యీ యుత్తమ భావాలన్నీ ఉత్సాహంతో నీ దినచర్యలో పాటించటానికి లోకోత్తరమైన దీక్షను పూనుకోగలవా? ఆ దీక్షచేత పరమానుభవ సంస్థితి కలిగి, దానిచే నీ విశాల శాంతమధురామృతపానం చేయ గల్గుతావు, చపలత్వం పోవాలిసుమా!

చ॥ చనవున బాలబాలికల సన్నిధిజేర్చుచు నాడినావు, పై
వనితలతోడ నెయ్యమున భవ్య సుకర్మల జేసినావు క్ర
44 న్నన బురుషాళితో గలిసి సౌఖ్యముగా జరియించినావు, ఈ
యనుభవమెల్ల జాలదె! పరాశ్రయమెందుకు వెర్రి ......

ఓ వెర్రిచిత్తమా! బాలబాలికలను దగ్గరకుజేర్చి ఆడుకున్నావు. తర్వాత స్త్రీలతోకలిసి అనేక మంచి కర్మలను చేశావు. పిదప పురుషులతో చక్కగా కలిసి తిరిగావు. ఈ అనుభవాలన్నీ చాలవా? ఇక పరుల నాశ్రయించటం దేనికి?

ఉ॥ చేసితివన్నదానముల, జేసితి పెద్దల సంగతిన్, గడున్
జేసితి గ్రంథపాఠముల, జేసితివింక నసంఖ్య సత్క్రతుల్,
45 చేసినవెల్ల జాలవె! విశేషముగా శ్రమజెంది యిట్టిలీ
వేసట నిచ్చు కార్యముల వీడుము శాంతి గడింప .......

ఓ చిత్తమా! అన్నదానాలు చేశావు. పెద్దల సాంగత్యంచేశావు.

గ్రంథపాఠాలను చదివావు. అనేక సత్కార్యాలు చేశావు. ఈ చేసిన్న వన్నీ చాలవా? ఈ విధంగా అధికంగా శ్రమ చేశావు. ఇక శాంతిన పొందాలంటే యీ శ్రమతో కూడిన కార్యాలను వదులుకో..

ఉ॥ సుంతయు జంకులేక జెడుచుందురొకండనుమాత్రముంటి నా
స్వాంతములోన నెంచి, సువిచక్షణదృష్టి యభావమౌట, నా
46 పంతయు సందులేక జగమంతట నిండుచు దేవుడుండ, నే
కాంతము గల్గునే యెచటనైన మరెవ్వరికైన......

ఓ చిత్తమా! ఒక్కడనుమాత్రమే ఉన్నానని మదిలో భావించి, వివేకం లోపించుటచేత, ఏమాత్రం జంకులేక చెడిపోతారుసుమా! సర్వ ప్రపంచంలో, సర్వత్ర వ్యాపించి భగవంతుడుండగా యిక ఎవరికైన ఏకాంతం అనేది కలుగుతుందా?

శా॥ ఏకాంతంబుననుంటినంచనుచు దుష్కృత్యంబులన్ జేసినన్
లోకాంతర్గతవర్తి ఈశ్వరుడు తా లోనుండి వీక్షింపడే?
47 ఏకాంతంబనునట్టిదే భ్రమసుమా దృగ్గోచరాతీతుడై
నీ కార్యంబుల జూచు సాక్షి యతడై నిక్కంబుగా ......

ఓ చిత్తమా! ఏకాంతంలో ఉన్నానని భావించి, చెడు పనులను చేస్తే లోకాంతర్గతవర్తి అయిన ఆ ఈశ్వరుడు లోనుండి చూస్తూంటాడుగా! ఈ బాహ్యదృష్టికి అగోచరుడై, నీవు చేసే పనులను చూచే సాక్షి యథార్థంగా ఆ ఈశ్వరుడే. అందువలన ఏకాంతం అనేదే భ్రమసుమా!

చ॥ ఎరుగనిదానిగూర్చి మనమెంతయినన్ బలుకంగవచ్చు, నీ
వెరిగినచో వచించుటలదృశ్యములౌ నిదియే రహస్య, మా

48 యెరిగివారు మౌనముసుమీ! మరి వర్ణనసేయుచుందు రీ
యెరుగనివారు గొప్పగ, నిదే భ్రమ యీ ధరలోన ......

ఓ చిత్తమా! తెలియనిదానిగూర్చి మాటల్లో ఎన్ని అయినా వచింపవచ్చు. కాని యథార్థ తత్వాన్ని గ్రహిస్తే యిక మాటలు లేవు సుమా! ఇదే పరమరహస్యం. తెలిసినవారు మౌనం వహిస్తారు. తెలియనివారుమాత్రం అనేకవిధాలుగా, చాల గొప్పగా వర్ణిస్తుంటారు. ఇదే యీ లోకంలో భ్రాంతి.

శా॥ మౌనంబే పరమార్థ సాధకము సన్మౌనాన సర్వంబు స్వా
ధీనంబౌ నిది సత్యమౌనుసుమ! నీ ధీరత్వమున్, యోగ్యతల్
49 దీనన్ బ్రస్ఫుటమౌను, కాక జగతిన్ ధిక్కారమున్ జేయుచో,
గానంరాదిక శాంతి, మూఢు పగిదిన్గా నెంతునే ......

ఓ చిత్తమా! మౌనం పరమార్థ సాధనం. యథార్థ మౌనం చేత సర్వం స్వాధీనం అవుతుంది. ఇది సత్యం. నీ ధైర్యస్థైర్యములు, యోగ్యతలు యీ మౌనంలో తెలుస్తాయి. అలాకాక యీ ప్రపంచాన్ని ధిక్కరిస్తే అసలు శాంతియే మృగ్యం అవుతుంది. అది మూఢంగా పరిణమిస్తుందిసుమా!

ఉ॥ లొంగుటకాదు మౌనమున లోకజయంబది, యిద్రియంబులున్
భంగమునొందు మౌనమున, భావవిభూతియు వృద్ధి పొందు, సు
50 ప్పొంగెడు నాత్మశక్తి, యఘపుంజము నాశమునొందు, గాన నే
భంగినినైన దీని సముపార్జన ముఖ్యముగాదె......

ఓ చిత్తమా! మౌనం అంటే ఏమిటో చెప్పుతాను విను. మౌనం అంటే లొంగటం కాదు, లోకాన్ని జయించటం. ఈ మౌనంలో యింద్రి

యసమూహం భంగం పొందుతుంది. భావాభివృద్ధి కలుగుతుంది. ఆత్మ శక్తి ఉప్పొంగుతుంది. పాపసంచయం నశిస్తుంది. ఇటువంటి యీ మౌనాన్ని ఏవిధంగానైనా ఆర్జించటం ముఖ్యంగదా!

చ॥ ఇది విడరాని సాధన, మహిన్ గల సర్వమతాలకున్ సుఖ
ప్రదమగు మార్గరాజము, ప్రభావయుతంబు, ఫలంబు వెంటనే
51 యొదవును ప్రస్ఫుటక్రియ, నిక యోచనలేల ధరింపు మౌనమున్
సదమలతత్త్వయోగమును, సద్గతి గల్గును నీకు ......

ఓ చిత్తమా! ఈ మౌనం ఎంతకాలము అనే ప్రశ్న లేదు ఎల్లప్పుడూ దీన్ని పాటించవచ్చు. ఈ లోకంలో ఉన్న సర్వమతాలకు సుఖాన్ని ప్రసాదించు రాజమార్గమిదే. ప్రభావంతో కూడుకున్నది సద్యోఫలితాన్ని ప్రసాదిస్తుంది. కాన యిక నీవు ఆలోచించక నిర్మల తత్త్వయోగమైన మౌనాన్ని ధరించు. దానిచేత నీకు సద్గతి లభిస్తుంది. సుమా!

మ॥ అతిసూక్ష్మంబుగ దాగు దుర్గుణసమూహంబున్ బలత్కార సం
గతితోడన్ వెలిబుచ్చి త్రుంచి సతమున్ గళ్యాణమున్ గూర్చు, యీ
52 ప్రతిలేనట్టి పథంబు మౌనమును నీ ప్రావీణ్యతన్ బూనుమా,
స్తుతిపాత్రంబిది సమ్మతంబిది మహాశోభార్థివై .......

ఓ చిత్తమా! ఈమౌనం, మనకు తెలియకుండ అతిసూక్ష్మంగా లోపల ఉండే దుర్గుణ సమూహాన్ని బలవంతంగా బయటకు త్రోసి నశింపజేస్తుంది. ఎల్లప్పుడు కల్యాణాన్ని చేకూరుస్తుంది. ఇటువంటి ఎదురులేని మార్గమైన మౌనంలో ప్రావీణ్యతను సంపాదించుకో శోభా

సంయుతమైన జీవితాన్ని కోరుకో, అనేక సంస్తుతులకు పాత్రమైనదీ మౌనం, యోగ్యమైనదికూడా.

చ॥ మననము వృద్ధిగాంచనగు మౌనము, ధ్యానము దానినుండియే
జనితము, ధ్యానజన్యముగ సంభవమౌను సమాధి, దానితో
53 జను వెనువెంట మోక్షమను సత్యమునే గ్రహియించి, మౌన సా
ధన గల శ్రేష్ఠతన్ దెలిసి, దాని ధరించి చరింపు ......

ఓ చిత్తమా! మననం అభివృద్ధిచెందితే మౌనం అవుతుంది. మౌనంనుండి ధ్యానం పుట్టుతుంది. ఆ ధ్యానంవలన సమాధి కలుగుతుంది. ఆ సమాధితోడనే మోక్షం అనే సత్యాన్ని గ్రహించు. కాన మౌనముయొక్క శ్రేష్ఠత్వాన్ని గ్రహించి, సంచరించు.

మ॥ తులలేనట్టి యఖండశక్తి యిక నీతో నైక్యమై యొప్ప, రం
జిలు బ్రహ్మద్యుతి నీముఖంబున యశశ్ర్శీ నాట్యమాడంగ, శో
54 భిలు నీ శక్తి ప్రపంచమంతటను గంభీరస్థితిన్, గాన ని
ర్మల మౌనవ్రతదీక్ష బూనుమిక నీ లక్ష్యంబుగా ......

ఓ చిత్తమా! మౌనంవలన అతులమైన అఖండమైన శక్తి లభించి, నీలో లీనం అవుతుంది. నీ ముఖంలో బ్రహ్మతేజస్సు చిప్పిలుతుంది. యశస్సు నాట్యం చేస్తుంది. ప్రపంచమంతట నీ శక్తి గంభీరంగా ప్రకాశిస్తుంది. కాన యీ నిర్మల మౌనాన్ని నీ ఆదర్శంగా భావించి, యిక మౌనవ్రతదీక్షకు పూనుకో.

మ॥ సుచిరంబైన యథార్థ సంస్థితులలో శోభిల్లి మోదింప నెం
చుచు దివ్యంబుగ బ్రహ్మచర్యమున దృష్టుల్ బెట్టలేకున్న నీ

55 చిచె క్షేత్రంబును నింపబూని తగు గట్టే గట్టకున్నట్టు లా
టిచె దెల్వింగని బ్రహ్మచర్యమున నుండన్ బూనవే ......

ఓ చిత్తమా! ముఖ్య విషయం చెప్పుతాను విను. పొలాన్ని నీటిచే నింపబూనిన రైతు, చుట్టూ గట్టు కట్టక, ఎంతకాలానికైనా పొలం నింపలేనట్లుగా, శాశ్వతమై, యథార్థమైన ఆత్మసంస్థితులలో శోభించి, ఆనందించాలంటే తీవ్రంగా నీ దృష్టిని బ్రహ్మచర్యంమీద నిలపకున్నచో ప్రయోజనం శూన్యం. అందుచేత బాగా గ్రహించుకుని బ్రహ్మచర్యాన్ని సక్రమంగా పాటించటానికి పూనుకో.

శా॥ ఆర్యుల్ గొందరు బ్రహ్మచర్యపదవాక్యార్థంబునే చూచి, యా
కార్యానన్ గల సౌఖ్యమున్ దెలియకన్ గాబోలు, వాకొందు రే
56 చర్యన్ బ్రహ్మమునందు నుంట యని, మోక్షార్థంబుకై యెట్టి స
త్కార్యంబుల్ గలవో యెరుంగకయె పల్కంజూతురో ......

ఓ చిత్తమా! కొంతమంది, బ్రహ్మచర్య పద అర్థాన్నే స్వీకరించి, అందలి యథార్థ ఆనందాన్ని తెలుసుకొనలేకనేమో 'బ్రహ్మంలో చరించటం బ్రహ్మచర్యం' అని చెప్పుతూ ఉంటారు. కాని మోక్షం పొందటానికి ఎటువంటి సత్కార్యాలు ఉన్నవో తెలుసుకోలేక వారు ఆ విధంగా మాట్లాడుతుంటారుసుమా!

మ॥ అగునగు బ్రహ్మచర్యమన సొంతము బ్రహ్మమునందు వాసమే
యగు,నిజమున్ గ్రహింప, విషయంబులుశూన్యములై యశక్తులై
తగునటులాత్మశక్తి పరతంత్రములై తనరొంద నిట్టి రీ
తిగ నిక బ్రహ్మచారి జగతిన్ విషయాల మునుంగు ........

ఓ చిత్తమా! పూర్తిగా బ్రహ్మంలో నివసించటమే బ్రహ్మచర్యం అవుతుంది. యథార్థం ఆలోచిస్తే యీ బ్రహ్మచర్యంలో విషయాలు పూర్తిగా నశిస్తాయి. శక్తిహీనమవుతాయి. ఆత్మశక్తి అధీనంలో ఉంటాయి. ఈవిధంగా విషయములన్నీ నశించిన నిక బ్రహ్మచారి లౌకిక విషయాలలో మునగటం అసంభవం.

శా॥ అర్థంబున్ గ్రహియింపనెంచి పద వాక్యార్థంబులన్ వాని ల
క్ష్యార్థంబున్ క్రమరీతి నేర్చి పిదపన్ గాంక్షించు తత్త్వంబులన్
58 సార్థంబై హృదినుంచి యాచరణమున్ సాధింపగా నెంచుటే
సార్థక్యంబు నొసంగు, సాధన యగున్ సత్యంబుగా ......

ఓ చిత్తమా! అర్థాన్ని గ్రహించేముందు, పదముయొక్క వాక్యంయొక్క అర్థాలను, వాని లక్ష్యార్థాలను సక్రమంగా నేర్చుకొని, తరువాత తాను కాంక్షించిన ఆత్మతత్త్వాన్ని అర్థయుక్తంగా హృదయంలో నిలుపుకొని, ఆచరణలో సాధించటానికి పూనుకోటమే అర్థయుక్తమైన సాధన అవుతుంది. ఇది యథార్థంసుమా!

చ॥ ద్వివిధము బ్రహ్మచర్యమగు వీర్యనిరోధమునన్ బలంబు పొం
దు, విమల చిత్తమున్ గనునదే ప్రథమంబగు, నంత బ్రహ్మమున్
59 దవిలి యనంత సౌఖ్యగుణతత్పరతన్ గనుటే ద్వితీయమౌ
నవిరళమైన సాధనతో, సాధ్యము సిద్ధముగాదె ......

ఓ చిత్తమా! ఈ బ్రహ్మచర్యంకూడా ద్వివిధంగా ఉన్నది. వీర్య నిరోధంచేత బలాన్ని ఆర్జించి, నిర్మల చిత్తాన్ని పొందటం మొదటిది. తర్వాత బ్రహ్మతత్త్వాన్ని గ్రహించి, బ్రహ్మమే తానై, అనంతానందసంపదలలో తాదాత్మ్యాన్ని పొందటం రెండవది. అవిరళమైన సాధనచేత తప్పక సాధ్యం సిద్ధిస్తుందిసుమా!

ఉ॥ ధానికి సాధనల్ బలువిధంబుల నుండునుగాని యేది దే
హానికి బుద్ధికాత్మకు బునాదిగనుండెడు యింద్రియంబునే
60 పూని యొజస్సు జేయుచు, నపూర్వ వికాసము గల్గజేయునో,
దానిని బ్రహ్మచర్యమన ధర్మము నమ్ముము దీని ... ... ...

ఓ చిత్తమా! దీనికి అనేక విధములైన సాధనములు ఉన్నవి. కాని ఆత్మజ్ఞానానికి, దేహానికి, బుద్ధికి, ఆధారమైన ఇంద్రియాన్ని ఓజోరూపంగా మలిచి, అపూర్వ వికాసాన్ని, ఏది కలిగిస్తుందో అదే బ్రహ్మచర్యం అనటం ధర్మం. దీన్ని యథార్థంగా విశ్వసించు.

చ॥ అదియొకదాని నీవు సముపార్జన సల్పిన బ్రహ్మతేజమే
హృది తనువాత్మలందుగడు శ్రేష్ఠతజిందులుదొ్రక్కు, సాధ్యసం
61 పద యగు సర్వసాధనలు, పా్రప్తము శాంతియు శ్రేష్ఠమై సుఖ
ప్రదమగు బ్రహ్మచర్యమను పావనసువ్రతదీక్ష ... .......

ఓ చిత్తమా! ఈ ఒక్క బ్రహ్మచర్యాన్ని నీవు శ్రమ జేసి ఆర్జించినచో నీ శరీరంలో, నీ హృదయంలో, ఆత్మలో, ఆ బ్రహ్మ తేజస్సు అధికంగా చిందులు తొ్రక్కుతుంది. సకల సాధనలు సాధ్యం అవుతాయి. శాంతి లభిస్తుంది. అందుచేత యీ బ్రహ్మచర్యాన్ని శ్రేష్ఠమై, సుఖప్రదమై, పవిత్రమైన, చక్కని దీక్షగా భావించు.

చ॥ మనమును మోహనాశనము మాన్యత జేయును బ్రహ్మచర్యమే!
మనమును లొంగదీయు ఘనమంత్రము సూత్రము బ్రహ్మచర్యమే
62 మననము వృద్ధిసేసి మతిమంతుని జేయును బ్రహ్మచర్యమే!
మనకిక బ్రహ్మచర్యబలమాత్రముచేతనె ముక్తి .......

ఓ చిత్తమా! మనస్సులో ఉన్న మోహాన్ని చక్కగా నశింపజేసేది యీ బ్రహ్మచర్యమే. మనస్సును స్వాధీనం చేసుకొనే గొప్ప మంత్రము, సూత్రము, యీ బ్రహ్మచర్యమే. మనస్సును అభివృద్ధి చేసి, ధీ సంపన్నతను కలిగించునది యీ బ్రహ్మచర్యమే. ముక్తి కూడా యీ బ్రహ్మచర్యబలంచేతమాత్రమేసుమా!

ఉ॥ చాలము బ్రహ్మచర్యమును సల్పెడు ధన్యుని శక్తి బోల్పగా,
జాలము బ్రహ్మచర్యఘనసారనిలో ఆణసౌఖ్యమెంచగా,
63 జాలము బ్రహ్మచర్యసముపార్జన గల్గు ప్రకాశమెన్నగా,
జాలము బ్రహ్మచర్యమను సాధన సిద్ధి గణింప ......

ఓ చిత్తమా! ఆ బ్రహ్మచర్యాన్ని సక్రమంగా పాలించు ధన్యుని శక్తిని దేనితో పోల్చలేము. ఆ బ్రహ్మచర్యసారంలో మునిగినవాని సౌఖ్యాన్నిగూడ లెక్కింపలేము. ఆ బ్రహ్మచర్య పాలనచేత గలిగిన ప్రకాశాన్నిగూర్చి వచింపలేము. ఆ బ్రహ్మచర్యం అనే సాధనచేత లభించు సిద్ధులను గణింపలేము.

శా॥ పై లోకంబును ద్రుంచి, నిశ్చలమతిన్ భావించి తో లోక స
త్యాలన్, వాని జరింప గానగు ద్వంద్వాతీతమౌ స్థానమున్
64 కాలంబాది నిమిత్త దోషములు లేకన్ వెల్గు మూర్తిన్ మహా
జ్వాలా శక్తిని స్వీయరూపమును శోభాకాంతితో ......

ఓ చిత్తమా! పరలోక ఆసక్తిని దీసి, నిశ్చలత్వాన్ని పొంది లోక విషయాల గ్రహించి, ఆచరించి చరించినచో దేశకాల నిమిత్త దూరమై ప్రకాశించు దివ్యమూర్తిని, మహాతేజోశక్తిని, స్వస్వరూపమును, ద్వంద్వాతీతమైన స్థానాన్ని పొంది శోభిస్తావుసుమా!

మ॥ సులభత్వంబు వరింప గష్టమగు, నీ సౌలభ్యతన్ ద్రోసినన్
సులభంబౌగద మోక్షమార్గము, సదా సౌఖ్యంబునే గోరకన్
65 గలలోనైనను కష్టమంచనక లక్ష్యార్థంబుతో మున్గి, నీ
చలనత్వంబును వీడి దుంకినగదా సంతోషమౌ .......

ఓ చిత్తమా! సులభంగా దొరికేవి లోకవిషయాలు. ఈ సులభత్వాన్ని త్యజిస్తే మోక్షమార్గం సులభంగా లభ్యం అవుతుంది. సుఖాన్ని అపేక్షించక, స్వప్నంలోనైనా కష్టంగా భావించక, లక్ష్యసాధనలో మునిగి, నీ చపలత్వాన్ని వీడి దూకితేగదా నీకు సంతోషం ప్రాప్తిస్తుంది!

శా॥ దీనిన్ గాంచ కసౌఖ్యమున్ వలచి, తృప్తిన్ గాంచ యోచించిమా
ర్గానన్ దుంకి, సుఖంబుమారమగు ప్రారంభంబు వీక్షించి, యా
66 శానాశంబున దుఃఖమొంది, యుభయస్థానంబులన్ బాసి లో
కానన్ భ్రష్టతనొందువారి గనవే జ్ఞానార్థివై .......

ఓ చిత్తమా! ఈ రహస్యాన్ని గ్రహించలేక, సౌఖ్యాన్ని వాంఛించి, తృప్తి పొందాలని భావించి, మార్గంలో ప్రవేశించి, త్వరగా సుఖం లభించదనుకుంటూనే చింతించి, ఆశావినాశంచేత దుఃఖాన్ని పొంది ఉభయభ్రష్టులై లోకంలో ఎంతమంది ఉన్నారో చూడు! జ్ఞానాన్ని అర్థించే నీవు యీ స్థితిని గ్రహించుకో.

మ॥ సూత్రము చెప్పువాడ, విను సూక్ష్మముగా మతినుంచి, దీని నే
మాత్రములేవు యోగములు, మంత్రములేదు, జపంబు సున్న యే
67 యాత్రయు లేదు. లేవిచట వాసన కర్మలు నిష్ఫలంబు. నీ
సూత్రము కష్టమై మిగుల శుద్ధవివేకయుతంబు ......

ఓ చిత్తమా! నీకు సూత్రం చెప్పుతున్నాను విను. సూక్ష్మంగా వుంటుంది. శ్రద్ధగా విను. దీనిలో యోగం లేదు. మంత్రం లేదు. జపం లేదు. యాత్ర లేదు. ఆసనాలు లేవు. కర్మలు లేవు. నియమ నిష్ఠలు లేవు. ఈ సూత్రం శుద్ధవివేకంతో కూడుకున్నది. కష్టతి కష్టమైనదిసుమా!

చ॥ తెలియగ గష్టమంటినని దీనత బొందకుమమ్మ, దీని నే
సులభముగా నెరుంగ నొక సూత్రము దెల్పెద, దాని నమ్మి ని
68 శ్చలముగ జేయుదేని యిది సాధ్యము, పైనిది నిన్వరించి, నిన్
బలువిధ సౌఖ్యచంద్రికలపై నటియింపగజేయు .........

ఓ చిత్తమా! తెలియటం కష్టం అన్నానని నీవు భయపడకమ్మా! దీన్ని సులభంగా తెలిసికొనే సూత్రాన్ని నీకు తెలియజేస్తాను. దాన్ని నమ్మి, నిశ్చలంగా ఆచరిస్తే అన్ని సాధ్యం అవుతాయి. అప్పుడు ఆ స్థితి నిన్ను చేరి, నిన్ను సౌఖ్య చంద్రికలలో నాట్యం చేయిస్తుంది.

చ॥ వలసిన వస్తువుల్ వెలిరొ ప్రాప్తము కానివి, చిత్తసీమలో
దొరకుట, లోకమెందులకు? దూరమొనర్పుము, నీకు దానితో
69 గలుగదు లాభమింతయున, కావున తలంచి, వివేకముంచి, నా
పలుకుల నాలకించి, నడువన్ ముదమొందెదవమ్మ .... ....

ఓ చిత్తమా! నీకు కావలసిన వస్తువులు బాహ్యంలో దొరకవు. చిత్తంలో లభిస్తాయి. ఇక లోకం దేనికి? లోకాన్ని దూరం చేసుకో. నీకు యీ లోకంతో లాభం కలుగదు. కాన ఆ విషయాన్ని గ్రహించి, వివేకంతో నా మాటల నాలకించి నడచినచో సంతోషాన్ని పొందుతావమ్మా!

మ॥ 'ఇది యిట్లుండును, కాదు వే' రనుచు నీవీరీతి యోచించుచో
నది 'యిట్లుండదు వేరు గా'దనుచు సర్వాతీతమై యొప్పెడున్
70 'ఇది యెట్లున్నది?' యంచు నిర్మలమతిన్ హృద్వీధి వీక్షింప నె
మ్మది ప్రత్యక్షముగాదె యాత్మ నిజధర్మంబొప్పగా ........

ఓ చిత్తమా! 'ఇది యీ విధంగా ఉంటుంది. కాదు వేరు' అని 'అది యీ విధంగా ఉండదు. వేరు కాదు' అని ఆలోచిస్తే సర్వాతీతంగా ఉంటుంది. 'ఇది ఏ విధంగా ఉన్నది?' అని నిర్మలంగా హృదయవీధిలో వీక్షించిన, నిజధర్మంతో ఆత్మ ప్రత్యక్షం అవుతుందిసుమా!

ఉ॥ ఇంతకు బాహ్యమున్ మరచుటే ప్రథమంబగు దీన, దానితో
స్వాంతమునందు నమ్మకము శక్తియు గల్గును, పైన సాధనల్
71 శాంతవిధాన సాగు, నిజ శక్తిని నమ్ముట మోసపోక ని
శ్చింత జరించి పొందెదవశేషసుఖప్రదముక్తి ........

ఓ చిత్తమా! అసలు దీనిలో బాహ్యాన్ని మరచిపోవటమే మొదటిది. దానిచేత లోపల విశ్వాసం, శక్తి కలుగుతవి. తర్వాత సాధనలు శాంతంగా సాగిపోతాయి. తన శక్తిని గ్రహించుకోటంలో కూడా మోసపోరాదు. అప్పుడే నిశ్చింతగా చరించుచు, అనంతసుఖప్రదమైన ముక్తిని పొందగలవుసుమా!

మ॥ క్షణమైనన్ విడరాదు, దీని గురులక్ష్యంబుంచ ముఖ్యంబు, కా
క సుఖప్రాయము సందు ఏర్పడిన, మాయాశక్తి లోజొచ్చి, త
72 క్షణమే ధ్వంసమొనర్చు సర్వమును, ఏ కార్యంబు కష్టంబు
కావున నేర్పొప్ప మెలంగి, నిన్మరువకే ముఖ్యంబుగా ........

ఓచిత్తమా! ఒక్క క్షణంకూడ దీన్ని దూరం చేయకూడదు. ముఖ్యంగా దీనియందు గొప్ప లక్ష్యం ఉంచాలి. లేనిచో అణుప్రాయమైన ఏమరుపాటు కలిగినా మాయాశక్తి లోన ప్రవేశించి, అంతా నాశనం చేస్తుంది. ఈ విషయం చాల కష్టం. కాన నేర్పుగా మెలగుచు, నిన్ను మరిచిపోవద్దుసుమా!

మ॥ అగుటన్ నిత్యము సాధనానియతి శ్రేయస్కామివై యున్న, జే
రగ రాజాలునె దుష్ట భావములు ధైర్యంబొప్పగా గాంచి నిన్,
73 జగమే కంపము జెందు నీ పరమ తేజచ్ఛ్రీని గాంచంగ, ప్రా
పుగ నాత్మైక్యము చేతనుండునుసుమా పూర్ణంబుగా ........

ఓ చిత్తమా! నిత్యం నియమబద్ధమైన సాధనతో శ్రేయస్కామివై యున్నచో, ఏ ధైర్యంతో నిన్ను దుష్ట భావములు ఏ విధంగా చేరతాయి? నీ పరమైన తేజోపుంజాన్ని చూడటానికి లోకమే కంపిస్తుంది. నీకు పరిపూర్ణంగా ఆత్మైక్యం ఉంటుంది సుమా!

మ॥ 'బలహీనేన న లభ్యమాత్మ' యను సద్వాక్యార్థమిచ్చోటనే
చెలగున్, బుద్ధి శరీరమాత్మబలముల్ శ్రేష్ఠంబుగా బొంద, ప్రా
74 ప్తిలు సామర్థ్యము నాత్మశక్తియట, నాత్మీయంపు విశ్వాసమున్
గలుగున్ సిద్ధులు, కీర్తులున్ ప్రతిభ మోక్షార్థంబులున్ ........

ఓ చిత్తమా! శరీర, బుద్ధి, ఆత్మ బలములలో 'నాయమాత్మా బలహీనేన లభ్యః' అను వాక్యార్థములో ఆత్మబలమే శ్రేష్ఠమను విషయం సువ్యక్తం. ఆత్మశక్తి, ఆత్మవిశ్వాసం, సామర్థ్యములు అక్కడ ప్రాప్తిస్తాయి. అప్పుడే మోక్షార్థం సిద్ధులు, కీర్తులు, సర్వం లభిస్తాయి.

ఉ॥ చేయగలట్టి శక్తి గని జేయకయున్నను జాలు ధాత్రిలో,
గాయము నెంచకుండ క్షణకాలము బాయక శక్తి జూపుచున్,
75 జేయవలెన్ బ్రధానమగు జింతల సాధన నాత్మబొందగా,
నీ యుపయుక్తమార్గము గ్రహింపుమవశ్యము వెర్రి ........

ఓ వెర్రిచిత్తమా! లోకంలో శక్తిని సంపాదించి ఏమియు చేయక, లోపముల నెంచక, క్షణంకూడా మరువక, ఆత్మను పొందుటకు ముఖ్య విచారణ శక్తితో జేయుచు, సాధన సలుపవలెను. వెంటనే యీ ఉపయోగకరమైన మార్గాన్ని గ్రహించుకో.

ఉ॥ జాగ్రత జాగ్రతంచు బలుసారులు మేల్కొలుపుల్ బలించుచున్
అగ్రము జేరుదాక తనువంతట జాగ్రత మారుమ్రోగ, నీ
76 యుగ్రతపంబొనర్పుము మహోత్తమ దీక్ష ధరించి, మించి, ఏ
కాగ్రత ప్రజ్వలింప, నిదియ్యేసుమ సాధన వెర్రి .......

ఓ చిత్తమా! 'జాగ్రత జాగ్రత' అని అనేక పర్యాయముల మేల్కొలుపుల పలికిస్తూ, శిఖరం చేరేవరకు శరీరమంతటా జాగ్రత మారు మ్రోగించుకుంటూ, ఉత్తమ దీక్షతో మించి, ఉగ్రతపస్సును చెయ్యి. ఏకాగ్రత ప్రజ్వలింపజేసికో. ఇదే సాధనసుమా!

ఉ॥ హెచ్చుగ విద్య నేర్చినను దృష్టిని సాధన నుంచకున్న చో
మెచ్చడు దేవుడున్, జగతి మేలనదే, యనుభూతిలేక నే
77 మిచ్చెదవమ్మ భక్తులకు హీనదశన్ బడియుండి, గల్గునే
బిచ్చపుగాడు బిచ్చమిడ? వీడుము భ్రాంతిని వెర్రి .........

ఓ వెర్రిచిత్తమా! అధికంగా విద్యనేర్చినా సాధనపై దృష్టిని నిలపనిచో భగవంతుడు మెచ్చుకోడు. ప్రపంచంకూడా యిష్టపడదు. నీవే హీనదశలో, అనుభవరహితవై ఉంటే యిక భక్తులకు ఏమి యివ్వగలవు? యాచకుడు యాచకునికి ఏమివ్వగలడు? కాబట్టి అటువంటి భ్రాంతిని దూరం చేసుకో!

శా॥ గ్రంథజ్ఞానము వ్యర్థమంచనను, నా గ్రంథస్థమౌ భాషనే
యంధత్వంబున స్వీకరింపకయె, భాషాతీతమౌ భావ సం
78 బంధంబున్ గని దాని మార్గమున బోవన్ బూనుటే దివ్యమౌ
బంధచ్ఛేదకమైన సాధన యదే భాష్యంబగున్ ............

ఓ చిత్తమా! గ్రంథజ్ఞానం అనవసరంకాదు. కాని ఆ గ్రంథస్థమైన భాషనే గ్రుడ్డిగా స్వీకరించకు. భాషాతీతమైన భావసంబంధాన్ని గ్రహించి, ఆ మార్గంలో ప్రయాణం చేయటమే దివ్యమైన బంధవినాశకమైన సాధనసుమా!. అదే భాష్యం అవుతుంది.

ఉ॥ శక్తికిమించు సాధన యశస్సులకో, యవివేకమొందియో,
శక్తిని ధారవోయుటిక జాలును తీవ్రపు చింత జేసి నీ
79 శక్తి నెరింగి సాధ్యమగు సాధన బూనుము, నీకు దానిచే
శక్తి సుఖంబు డెందమున శాంతియు గల్గగదమ్మ ..........

ఓ చిత్తమా! సాధనలో కొన్ని విధానాలున్నవిసుమా! అవివేకంతో, కీర్తికోసం, శక్తికి మించిన సాధనచేసి, శక్తిని ధారవోయటం మంచిదిగాదు, నీ శక్తిని గ్రహించుకొని, తీవ్రంగా ఆలోచించి, నీకు సరిపడు సాధననే సాగించుకో. దానిచేత నీకు హృదయంలో శాంతి సుఖం లభిస్తాయమ్మా!

ఉ॥ అందని మ్రానిపండ్లకొరకై పరువెత్తుటగాదె! యిట్టి నీ
కందని సాధనానియతి, అందు ప్రయోజనమేమిటమ్మ! ఆ
80 నందములేక విభ్రమమునందు మునుంగుదువమ్మ! కాన నీ
చందము శక్తికిన్ దగిన సాధన మంచిదిగాదె, ......

ఓ చిత్తమా! నీ శక్తికిమించిన సాధన చేయటం అందని చెట్టు పండ్లకోసం పరుగులు వేయటంవంటిదని గ్రహించుకో. దానివలన నీకు ప్రయోజనం ఏమిటి? ఆ శక్తికిమించిన సాధనలచేత ఆనందం లేకపోగా భ్రమలో మునిగిపోతావు. కాబట్టి నీ శక్తికి తగిన సాధనా విధానం చాలా మంచిదిసుమా!

ఉ॥ యోగము మంచిదే, జపము యోగ్యము, ధ్యానముగూడ శ్రేష్ఠమే
త్యాగము నుత్తమంబు, భజనాదులుసైతము మంచివేసుమా!
81 బాగుగ విద్య నేర్చుటయు బాడియ, గాని మనంబు సాధనా
యోగనిమగ్నమైనగద యొప్పును సాధనలందు ......

ఓ చిత్తమా! యోగం మంచిదే, జపం యోగ్యమైనదే, ధ్యానం కూడా శ్రేష్ఠమే. త్యాగం ఉత్తమంసుమా! భజనాదికాలు మంచివే, చక్కగా విద్యనభ్యసించటం మంచిదే. కాని మనస్సు సాధనా యోగంలో నిమగ్నం అయితేగాని సాధన కాదుసుమా!

ఉ॥ కాన విచక్షణాపరతి గామమడంచి, మహేశు శ్రద్ధ చి
త్తాన ప్రతిష్ఠ జేసి, నిరతంబు నహీనచరిత్రనున్న, సు
82 జ్ఞానవిభూతి నాత్మ గననౌనని నమ్ముము, సాధనా నియో
గాన జరించి యుండుమిక గాలమమూల్యముసుమ్ము ......

ఓ చిత్తమా! కాబట్టి విచక్షణా జ్ఞానంతో కామాన్ని అణచి, శుద్ధ చిత్తంలో మహేశ్వరుని ప్రతిష్ఠించి, నిత్యం పవిత్రజీవనం సాగించినచో, సుజ్ఞాన విభూతియైన ఆత్మను పొందగలమని నమ్ము. కాలం అమూల్యం అయినది. కాబట్టి యిక నియమబద్ధమైన సాధనలో సంచరించు.

ఉ॥ చేయుట సేయనేర్పునను శిష్టపదంబుల లక్ష్యముంచకన్
జేయక జేయనేర్పునని జేరిన బెద్దల లాభమున్నదే!
83 చేయుటదెట్టులంచు మది జింతిలుచుండిన జింత దీరునే?
చేయుచు బట్టుతో మరల సేయుట సాధనయౌను ........

ఓ చిత్తమా! 'చేయుట చేయించుట నేర్పును' అను సూక్తుల నిర్లక్ష్యము జేసి, ఏమియు చేయక, చేయటం నేర్పుమని పెద్దల జేరిన ప్రయోజనమేమున్నది? లేక 'చేయటం ఎట్లు?' అని చింతిస్తూ ఉంటే చింతలు తీరుతాయా? పట్టుదలతో మరల మరల చేయటమే సాధన అవుతుందిసుమా!

ఉ॥ సాధన యన్న నేమి? కడు జాగ్రత నాత్మపరీక్ష సేయుటే
సాధన, దోషమున్న సువిశాలమనంబున సంస్కరించుటే
84 సాధన, మార్గమందు దన స్థానమెరుంగుచు మించజూచుటే
సాధన, సాధనంబున నసాధ్యము సాధ్యముగాదె ........

ఓ చిత్తమా! అసలు సాధనంటే ఏమిటి? చాల జాగ్రత్తతో ఆత్మ పరీక్ష చేసుకోటమే సాధన. దోషం ఉంటే విశాల మనస్సుతో దానిని సంస్కరించటమే సాధన. మార్గంలో తన స్థానాన్ని గ్రహించుకుంటూ మించి పోవాలనేదే సాధన. సాధనచేత అసాధ్యము సాధ్యము చేసుకోవచ్చునుసుమా!

శా॥ ఏ కార్యంబుల జేసినన్ బలికినన్ హృద్వీధి యోచించినన్
నీకున్ దాని ఫలంబుగా గలుగునే నిక్కంపు మోక్షార్హతల్?
85 చేకూరంగలదే ముదంబని సదా చింతించి తీవ్రంబుగా
నేకాగ్రస్థితినుంట సాధనసుమా యింతేలనో .......

ఓ చిత్తమా! లోకంలో ఏ పనులు చేసినా, మాట్లాడినా హృదయంలో భావించినా, వాని ఫలితంగా నీకు యథార్థమగు మోక్షార్హతలు కలుగుతాయా? లేక ఆనందం కలుగుతుందా? అని తీవ్రంగా ఆలోచించి, ఏకాగ్రస్థితిలో ఉండటమే సాధనసుమా!

చ॥ భయమనలేదు సుంతయిస భారము సాధనమీద నున్నచో,
భయవినయంబులన్ గలిగి పర్విడు నీ వెనువెంట లోకముల్,
86 ప్రియమున బెద్దలెల్లరు భళీ భళీ యందురు గాన, సాధనా
మయమొనరింపు జీవితము మాటలు వేయిగనేల ........

ఓ చిత్తమా! సాధనమీద భారం ఉంచితే నీకు భయం ఉండనే ఉండదు. భయవినయాలతో లోకం నీ వెనుక పరుగులు చేస్తుంది. పెద్దలు ప్రేమతో మెచ్చుకొంటారు. కాన నీ జీవితాన్ని సాధనామయం చేసుకో ఆచరణలేని మాటలెందుకు?

ఉ॥ తక్కువ కాయకష్టము, యథార్థ విరాగము, చిత్తసీమలో
నెక్కువ తీవ్ర వేదనము నెంచగ సాధనయౌను వానిలో
87 నొక్కటి లోపమైన నిక నుత్తమ తత్త్వవిభూతిరాదు నా
నొక్కి వచించువాడ నిదుగో వినుమంతటనైన ......

ఓ చిత్తమా! ఇందులో కాయకష్టం తక్కువగా ఉంటుంది. యథార్థ విరాగం ఉండాలి. చిత్తంలో తీవ్ర ఆవేదన ఉండాలి.

ఈ త్రయం సాధన. పై మూడింటితో నే ఒక్కటి లోపించినను యిక ఉత్తమ తత్త్వానుభూతి కలుగదు అని నీకు గట్టిగా చెప్పు తున్నాను. యిప్పటికైనా నా మాట విను.

ఉ॥ సాధన, జాతి వర్ణ మత జాడలెరుంగదు, లింగభేద దుర్
బాధల పొంగబోదికను, ప్రాయ విచక్షణ చేయబోదు, నీ
88 ధీ ధన ధాన్య సంపదల ధీరత జూడదు, గాని నీదు హృత్
శోధన నాశ్రయించి మనుచుండును బానిసభంగి ... ...

ఓ చిత్తమా! ఈ సాధనలో జాతి, మత, వర్ణ, వ్యవస్థలులేవు స్త్రీ, పురుషులు అను లింగభేదములు లేవు, వయస్సు విచారణ లేదు. తెలివితేటలు, ధనధాన్య సంపదలను చూడదు. కాని నీ హృదయ పరిశోధన నాశ్రయించి, యీ సాధన బానిసవలె నిన్నాశ్రయించి ఉంటుందిసుమా!

చ॥ మడిమయిలాది నీమముల మాటలు లేవిట, జేయు కాంక్ష గ
ల్గెడు గడియే శుభప్రదము, కేవల నిర్మల చిత్తముండుటే
89 మడి యగు, దీని మర్మము సమంచితరీతి గ్రహించి, చక్కగా
నడచిన సాధనందురిది నాణ్యవిధానముసుమ్ము ......

ఓ చిత్తమా! ఈ సాధనలో మడి, మైల, అను నియమాలు లేవు. సాధన చేయవలెననే తీవ్ర కాంక్ష కలగటమే సుముహూర్తం. నిర్మలమైన మనస్సు ఉండటమే మడి అని అర్థం. దీని రహస్యాన్ని చక్కగా గ్రహించుకొని, చక్కగా నడిచినచో దీనినే సాధన అంటారు. ఇది మంచి మార్గము సుమా!

ఉ॥ చూచుచు జూడనట్లు, వినుచున్ విననట్టుల, లోన దోచియున్
దోచనియట్లు, ధీ ప్రగతి దూరపు దృష్టుల గల్గి, సాక్షివై

90 చూచుచునుండుచో జగతి శూన్యము దాల్చెడు, నాత్మస్పష్టమై
దోచుచు, సాధనంబనగ దుష్కరమై సులభంబు ......

ఓ చిత్తమా! ఈ లోకంలో చూస్తూ చూడనట్లుగా, వింటూ విననట్లుగా, లోపల ఆలోచించియు ఆలోచించనివిధంగా, తీవ్రంగా, దూరదృష్టుల గలిగి, సాక్షివై చూస్తూ ఉంటే, లేని జగత్తులేకుండి నిత్యమైన ఆత్మ సుస్పష్టం కాగలదు. సాధన అనగా మొదట కష్టమై, పిదప సులభంగా ఉంటుందిసుమా!

ఉ॥ సాధనచేతనేగద ప్రశస్త విముక్తి గడించిరా ఋషుల్
సాధనచేతనే యుపనిషత్ ద్యుతి ధారుణి ప్రజ్వలించె, నా

91 సాధనచేతగాదె గనె శక్తిని రాయిలొ రామకృష్ణుడున్
సాధనచేత సాధ్యపడజాలనిదెద్దియు లేదు ......

ఓ చిత్తమా! సాధనలేనిదే ఏమీ చేయలేముసుమా! మహర్షులందరూ ప్రశస్తమైన విముక్తిని పొందారు యీ సాధన చేతనే. ఈ సాధనచేతనే ప్రపంచంలో ఉపనిషత్ తేజోపుంజము ప్రకాశించింది. ఈ సాధనచేతనే శ్రీరామకృష్ణ పరమహంస దేవుడు జడమైన రాయిలో జగన్మాతను దర్శించాడు. సాధనచేత సాధ్యంకానిది ఏదీ లేదుసుమా!

ఉ॥ ఏగతి భానుబింబముదయింపక బూర్వము స్వర్ణకాంతు లు
ద్యోగముతో జనించి మహితోన్నతి భాస్కరు రాక జాటునో

92 ఆ గతి స్వాత్మ నమ్మకము అద్భుత భాస్వర కాంతిపుంజమై
రాగవిభూతినాత్మలయలక్షణమున్ బ్రకటించు ......

ఓ చిత్తమా! సూర్య భగవానుడుదయింపకముందు కాంతి కిరణములు జనించి, దివాకరుని మహిమను, రాకను ఎట్లు తెలుపునో అదేవిధంగా ఆత్మవిశ్వాసం తేజోవంతమైన అద్భుత కాంతిపుంజమై వచ్చి, ఆత్మవిభూతిని సూచిస్తుంది.

ఉ॥ సాధన సాధ్యమౌ నిక, విశాలత గల్గు మనంబునందు, నే
బాధలు లేక మార్గమిక భాసిలు సున్నితమై, విశాలమై,
౯౩ క్రోధ సమూహమంతమగు, గోరికలెల్ల నశించు, దీనికై
సాధన సల్పుమమ్మ యిక శాశ్వతముక్తి లభించు ......

ఓ చిత్తమా! అప్పుడు సాధన సాధ్యం అవుతుంది. మనస్సులో విశాలత్వం సిద్ధిస్తుంది. ఏ బాధలు లేక మార్గం సున్నితంగా, విశాలంగా ప్రకాశిస్తుంది. కామక్రోధాదికసమూహం నశిస్తుంది. కోర్కెలన్నీ అంతం అవుతాయి. దీనికోసం సాధన చేయమ్మా! ఆ సాధనచేత శాశ్వతముక్తి లభిస్తుంది.

ఉ॥ అనుభవమా? యభావముగదా వెలియందు, మనంబునుండు నా
యనుభవమున్ గడింపగ హృదంతరవీధుల బర్వులెత్తుచో
94 ననయము శాంతిధామమున హాయి విహారము సల్పుచుందు వా
గుణపథమున్ వరించి యదిగో సుఖమున్ గనుమమ్మ ......

ఓ చిత్తమా! అనుభవమంటే బాహ్యంలో లేదుసుమా! మనస్సులో ఉంటుంది. ఆ యనుభవాన్ని సంపాదించటానికి హృదయాంతర్గత మార్గములందు పరుగులు వేయాలి. అప్పుడు సదా

శాంతిధామంలో హాయిగా విహారం చేయగలవు. ఇక ఆ మంచి మార్గాన్ని వరించి యథార్థ సుఖాన్ని పొందగలవు.

ఉ॥ జ్యోతికి మధ్యనున్నదగు జ్యోతియ, చీకటిలోని చీకటుల్
జేతనతత్త్వమందుగల చేతనశక్తియ, శాంతి శాంతికిన్,
95 ధాతకు ధాతయై వెలుగు తత్త్వము సెప్పగ నేరికౌను? ఆ
జ్యోతి నెరుంగు మార్గమిక నుత్తమసాధనగాదె ……

ఓ చిత్తమా! ఆ యాత్మ జ్యోతులకు జ్యోతియైనది. చీకటికి చీకటియైనది. చేతనత్వంలోని చేతనమైనది. శాంతికి శాంతమైనది. సృష్టకు సృష్టయైనది. ఇటువంటి ఆత్మనుగూర్చి ఎవరు చెప్పగలరు? ఆ జ్యోతిని తెలుసుకొను మార్గమే ఉత్తమ సాధన గదా!

మ॥ వినినావా! కనుమొక్కసారి యట గంభీర ప్రకాశాత్మవై,
వినరానట్టి వినిర్మలత్వమున స్థంభీభూతమై శాంతమై,
96 అనవద్యంబగు నాత్మసంస్థితులలో నైక్యంబవై, బ్రహ్మమం
దు నభేదస్థితి నుండగల్గుదువు సద్యోగంబునన్ ……

ఓ చిత్తమా! ఒక్కసారి చూడు. అనవద్యమైన ఆత్మ సంస్థితులలో ఏకత్వాన్ని పొంది, గంభీర ప్రకాశాత్మవై, నిర్మలత్వంలో మునిగి, శాంతమూర్తివై నీవేనాడు వినరాని అభేద బ్రహ్మస్థితులలో నైక్యమై, సద్యోగంలో నుండగలవు. విన్నావా?

శా॥ గమ్యస్థానము సెప్పరానిది, మహాగంభీరమై, నిత్యమై,
సౌమ్యంబై, సగుణంబు నిర్గుణమునై, సౌఖ్యాబ్ధిసంపూర్ణమై,

97 సామ్యస్థానవిదూరమై, యతులమై, శక్తిస్వరూపంబునై,
గమ్యస్థానమతీతమై తనరు దుర్గ్రాహ్యంబుగా ......

ఓ చిత్తమా! ఆ గమ్యం ఎటువంటిదో తెలుసునా? ఆ గమ్యం వచింప వీలుకానిది. మహాగంభీరమైనది. నిత్యమైనది. సౌఖ్యమైనది. సగుణమైనది. నిర్గుణమైనది. సంపూర్ణసుఖసాగరమైనది. దానికిసమానమైన మరియొక స్థానములేనిది. అతులమైనది, శక్తి స్వరూపమైనది గ్రహించుటకు వీలుకానిది, అతీతమైనది. ఇదే గమ్యస్థానం.

చ॥ కనగ వచింపగన్ వినగ గైకొనగన్ జదువంగ దూరమై
తన నిజతత్త్వమందరికి దగ్గరనుండియు నంటకుండు, న
98 ట్లనుపమ నిర్మలత్వమున నందనిదై యతిసూక్ష్మమై సదా
యనుభవనీయమై తనరు నవ్యయమైనది యాత్మ ......

ఓ చిత్తమా! ఆ యాత్మ చూడబడదు. వాక్కు వివరించలేదు. చెవులు వినలేవు. చేతితో స్పృశింపబడదు. యోచనకు అందనిది. అందరికి సన్నిహితమైనను అందనిది. అది అతి నిర్మలమగుటచే నందనిదై, అతి సూక్ష్మమైనది. అవ్యయమైనది. సదా ఆ యాత్మ అనుభవైకవేద్యమే యగుచున్నది.

ఉ॥ అంతట నిండియుండు యఖిలాండములందు వసించుచుండి యా
వంతయు గోచరింపక నియంతగనుండి చరించునాత్మ, ఏ
99 కాంతమునందు సాధన భయంబుల వీడుచు, జేయు సాధక
స్వాంతములందుమాత్రము విశాలత గోచరమౌను ......

ఓ చిత్తమ! ఆ యాత్మ అంతట వ్యాపించి యున్నను దృగ్గోచరముకాక నియంతగా నుండి శాసిస్తుంది. ఏకాంతంతో

భయములేక సాధనల సలుపుచున్న సాధకుల హృదయములం మాత్రము విశాలంగా గోచరిస్తుంది. అదియే ఆత్మ.

ఉ॥ అందును యందకుండును మహాద్భుతశక్తిగలట్టి యాత్మ, పు
ట్టొందును పుట్టకుండును మహోన్నతశక్తిగలట్టి యాత్మ, ఆ
100 నందము గల్గి గల్గనిది నర్తనశక్తిగలట్టి యాత్మ, యీ
చందము వింతతత్త్వములసారము దూరము, ఆత్మ ......

ఓ చిత్తమా! ఆ యాత్మ అంది అందక ఉండే అద్భుతమైన శక్తి గలది. ఆ యాత్మ పుట్టి, పుట్టక ఉండే ఉత్కృష్టమైనది. ఆ యాత్మ ఆనందము కలిగి, కలగని నర్తనశక్తి గలది. వింత తత్త్వముల సారము, దూరమైనదిసుమా ఆ యాత్మ!

హరిః ఓం తత్ సత్

---

చదవండి! శ్రీ అనుభవానందస్వామి విరచితమైన ఆత్మ తత్త్వానుభూతిగల శతకములు.

1. శ్రీ రామకృష్ణాంజలి,
2. శ్రీ దక్షిణేశ్వరీ స్తవము,
3. అనుభవానందము

---